# వీడ్కోలు పదవికే.. సేవకు కాదు

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



యాదగిరిగుట్ట మున్సిపల్ పాలకవర్గ సన్మాన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

యాదగిరిగుట్ట, జనవరి 26 : రాజకీయాల్లో వీడ్కోలు అనేది పదవికి మాత్రమేనని, సేవకు కాదని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుండే నాయకులకు ప్రజల గుండెల్లో ఎప్పుడూ పదవి ఉన్నట్టేనని పేర్కొన్నారు. యాదగిరిగుట్ట పురపాలక సంఘం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల వీడ్కోలు సన్మాన సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన పాలకవర్గాన్ని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల వరకు తమ వార్డుల్లో బాధ్యతాయుతంగా పనిచేసి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధ, వైస్ చైర్మన్ మేడబోయిన కాటంరాజు, కమిషనర్ అజయ్‌కుమార్, కౌన్సిలర్లు ఆవుల మమత, దండబోయిన అనిల్, తాళ్ల నాగరాజు, బూడిద సురేందర్, గుండ్లపల్లి వాణి, గౌలికార్ అరుణ, బిట్టు సరోజ, ముక్యర్ల మల్లేశ్, సీస విజయలక్ష్మి, కో ఆప్షన్ సభ్యులు గోర్ల పద్మ, రిజ్వానా, సయ్యద్ సలీం పాల్గొన్నారు.

## మున్సిపల్ పాలకవర్గానికి సన్మానం



మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మిని సత్కరించి మెమొంటో అందజేస్తున్న కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్

భూదాన్ పోచంపల్లి, జనవరి 26 : మున్సిపల్ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో పురపాలక కార్యాలయంలో చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, పాలకవర్గ సభ్యులను కమిషనర్ వెంకటేశ్వర్‌నాయక్ ఆదివారం సత్కరించి మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి మాట్లాడుతూ ఐదేండ్ల తమ పాలనలో సుమారు రూ.70 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. పట్టణంలో సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, నీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు, ఫోర్ వే రోడ్డు, బటర్ ఫ్లై లైట్ల ఏర్పాటుకు తన వంతు కృషి చేశానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ప్రస్తుత ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సహకారంతో పట్టణ అభివృద్ధి చేశానన్నారు. అభివృద్ధికి సహకరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బాతుక లింగస్వామి, కౌన్సిలర్లు దారెడ్డి మంజుల, సురుకంటి జ్యోతి, పెద్దల చక్రపాణి, కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, భోగ భానుమతి, మోటె రజిత, కుడికాల అఖిల, దేవరాయ కుమార్, కో ఆప్షన్ సభ్యులు జల్ది నరసింహ, నుస్రత్ సుల్తానా, రావుల లావణ్య, సయ్యద్ అజ్జు, సీనియర్ అసిస్టెంట్ ఆదిత్య, సిబ్బంది పాల్గొన్నారు.

## నోముల నర్సయ్యకు ఉత్కృష్ట సేవా అవార్డు



నోముల నర్సయ్యకు ఉత్కృష్ట సేవా అవార్డు అందజేస్తున్న టీజీ ఎస్పీ మురళీకృష్ణ

రామన్నపేట, జనవరి 26 : మండలంలోని నీర్నెముల గ్రామానికి చెందిన నోముల నర్సయ్య యూసుఫ్‌గూడ ఆర్‌ఐగా విధులు నిర్వహిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఉత్కృష్ట సేవా అవార్డును ప్రకటించింది. ఆదివారం జరిగిన వేడుకల్లో ఫస్ట్ బెటాలియన్ కమాండెంట్ యూసుఫ్‌గూడ టీజీ ఎస్పీ మురళీకృష్ణ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న ఆయనకు కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, స్నేహితులు అభినందనలు తెలిపారు.

## క్రీడలతో మానసిక ప్రశాంత



క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి

వలిగొండ, జనవరి 26 : క్రీడలు శారీరక ధృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతతకు దోహదం చేస్తాయని వలిగొండ పీఏసీఎస్ చైర్మన్ సుర్కంటి వెంకట్‌రెడ్డి అన్నారు. మండలంలోని నాగారం గ్రామంలో మంగళ వినయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి గ్రామీణ క్రీడోత్సవాల విజేతలకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల వల్ల క్రీడాకారుల మధ్య స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్లంకి స్వామి, బెలిదె నాగేశ్వర్, ఎండీ సలీం, ప్రవీణ్, వేణు, మహేశ్, సహదేవ్, వినయ్, నవీన్, సతీశ్, సంపత్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

WANTED
★ త్రినేత్ర హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్లు, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18K. Ph: 8520980099 / 8520874499.
NT-327012-AII

CHANGE OF NAME
I BANAVATH SAIDAMMA, W/o. SAIDA, R/o. Village Kalvapally Thanda, Miryalaguda Mandal, Nalgonda District here by state that my LIC Policy No.603736393 Records was Recorded as Banavath Saidamma, My actual & Correct Name is BANOTHU DORJI (as per my Aadhar card & Bank Account) Hence both Names are one and same.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines, Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా॥ చర్లపల్లి, మం॥ నల్లగొండ.

| | | |
|---|---|---|
| నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635 |
| హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638 |
| మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638 |

# కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల లొల్లి

- ఫొటోల ఏర్పాటుపై జిల్లా పార్టీ కార్యాలయంలో రగడ
- ఫ్లెక్సీలు చించివేసిన కుంభం వర్గీయులు



కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపిన కార్యకర్తలు

భువనగిరి అర్బన్, జనవరి 26 : భువనగిరి పట్టణ పరిధిలోని ఎస్ఎల్ఎన్ఎస్ డిగ్రీ కళాశాల ముందు ప్రధాన రహదారిపై కాంగ్రెస్ పార్టీ జిల్లా నూతన కార్యాలయాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన కొన్ని ఫ్లెక్సీలలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఫొటో వేయకపోవడం, వేసినా చాలా చిన్నగా వేయడంతో భువనగిరి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహానికి గురయ్యారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఫొటోలు ఎలా పెద్దగా వేశారని మండిపడ్డారు. దీంతో కుంభం వర్గీయులు ఇది కాంగ్రెస్ పార్టీ కార్యాలయమా? లేక బీర్ల ఐలయ్య సొంత పార్టీ కార్యాలయమా ? అంటూ ఆందోళన చేశారు. మోటకొండూర్ కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో బీర్ల ఐలయ్య ఫొటోలు మాత్రమే ఉన్నాయని, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఫొటో లేదని, డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఫొటో ఉన్నా కూడా అది నామమాత్రంగా చిన్నగా ఉందని, స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కించపరిచే విధంగా ఏర్పాటు చేశారని ఆ పార్టీ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఇదంతా బీర్ల అయిలయ్య వల్లనే జరిగిందని కుంభం వర్గీయులు నిలదీశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన బీర్ల ఐలయ్య ఫొటో ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లు, కాంగ్రెస్ పార్టీ తోరణాలను చించివేశారు.

**బొల్లెపల్లి గ్రామంలోనూ..**

భువనగిరి మండలం బొల్లెపల్లి గ్రామంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు గోద శ్రీనివాస్‌గౌడ్, గోద రాహుల్‌గౌడ్ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఫొటోలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ ఫ్లెక్సీలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఫొటో పెద్దగా ఎందుకు వేశారని, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఫొటో ఎందుకు చిన్నగా వేశారని ఆ పార్టీ కార్యకర్తలు ఫ్లెక్సీలు చించివేశారు. దీంతో బొల్లెపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో ఇరువర్గాల పోరు బయటపడింది.

## యువశక్తితోనే దేశాభివృద్ధి

వలిగొండ, జనవరి 26 : దేశభక్తి, నిరంతరం శ్రమించే యువశక్తితోనే దేశం అభివృద్ధి చెందుతుందని వన్ స్టాప్ సొల్యూషన్ ఫర్ యూత్ ఎన్జీఓ ఆర్గనైజేషన్ సంస్థ వ్యవస్థాపకుడు చావా రాజ్‌కుమార్ అన్నారు. మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో 'దేశాభివృద్ధిలో యువశక్తిని చూపుదాం' అంశంపై శనివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లీడ్ టుడే చేంజ్ టుమారో అనే లక్ష్యంతో యువత పనిచేసి దేశాన్ని అగ్రభాగాన నిలుపాలన్నారు. హరిత గృహ వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి, రాబడిని అన్ని కాలల్లో పొందుతారని తెలిపారు. కార్యక్రమంలో పి.బాలస్వామి, మహేశ్వర్‌గౌడ్, మల్లేశం, కొండల్‌రెడ్డి, వెంకట్‌రాజ్, శ్రవణ్‌రెడ్డి, సంపత్‌కుమార్, శ్రవణ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## వంగపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభం

యాదగిరిగుట్ట, జనవరి 26 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా మండలంలోని వంగపల్లి గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను డీసీపీ రాజేశ్‌చంద్ర ప్రారంభించారు. మొదటగా ట్రాఫిక్ పోలీస్ టీం, యాదగిరిగుట్ట ఎస్పీఎఫ్ జట్లు తలపడగా ట్రాఫిక్ టీమ్ గెలుపొందింది. పట్టణ పోలీస్ స్టేషన్, రూరల్ పోలీస్‌స్టేషన్ జట్లు పోటీ పడగా, రూరల్ పోలీస్‌స్టేషన్ గెలుపొందింది. సెమీ ఫైనల్‌లో మీడియా టీమ్, యాదగిరిగుట్ట ట్రాఫిక్ జట్టు తలపడగా ట్రాఫిక్ టీమ్ గెలిచి ఫైనల్‌లోకి వెళ్లింది. సోమవారం ఫైనల్‌లో ట్రాఫిక్, రూరల్ పోలీస్‌స్టేషన్ జట్లు తలపడనున్నాయి.

## తల్లీకూతురు అదృశ్యం

చౌటుప్పల్ రూరల్, జనవరి 26 : మండలంలోని దండు మల్కాపురం గ్రామానికి చెందిన తల్లీకూతురు అదృశ్యమయ్యారు. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ అఫ్రీన్, ఆమె కూతురు సఫా బేగం శనివారం ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆమె భర్త అజీంఖాన్ బంధువుల ఇంట్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దాంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కె.యాదగిరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి

యాదగిరిగుట్ట, జనవరి 26 : మండలంలోని కాచారం గ్రామంలో కుక్కల దాడిలో 16 గొర్రెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన దడిగే అయిలయ్య శనివారం తన గొర్రెలను మేపుకొచ్చి రాత్రి దొడ్డిలో తోలాడు. ఆదివారం ఉదయం వచ్చిచూసే సరికి 16 గొర్రెలు తీవ్రగాయాలతో మృతి చెంది ఉన్నాయి. సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు. గ్రామంలో కుక్కలు స్వైరవిహారం చేస్తూ చిన్నారులు, జీవాలపై దాడులు చేస్తున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. బాధితుడిని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ఎక్స్‌గ్రేషియా అందజేత

రామన్నపేట, జనవరి 26 : నలగొండ – రంగారెడ్డి పాల ఉత్పత్తిదారుల సంఘం పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామ శాఖ పాల ఉత్పత్తిదారుల సంఘం సభ్యులు పలువురు కొన్ని రోజుల క్రితం మరణించారు. వారిలో పగడాల రామచంద్రానికి రూ.60వేలు, తెడ్డు శేఖర్‌కు రూ.60వేలు, పెద్దగోని నర్సింహకు రూ.10వేలు, జిట్టబోయిన అంజయ్యకు రూ.10వేలు, కనకబోయిన మదార్‌కు రూ.10వేలు, కొత్త పెంటయ్య రూ.10వేలు ఎక్స్‌గ్రేషియా మంజూరు కాగా ఆదివారం సంఘం అధ్యక్షుడు సింగనబోయిన సత్యనారాయణ వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు కేస వెంకటేశం, గర్దాసు దామోదర్, కొలగాని పాండు, శ్రీశైలం, అశోక్, సత్యనారాయణ, రవిశంకర్, కవిత, సుజాత పాల్గొన్నారు.

## విద్యార్థులకు బహుమతులు అందజేత



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి

బీబీనగర్, జనవరి 26 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కొండమడుగు గ్రామ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు తెలంగాణ ఉద్యమ నాయకుడు స్వర్గీయ జిట్ట బాలకృష్ణారెడ్డి జ్ఞాపకార్థం బీఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు భాషబోయిన పెంటయ్య, సుర్వి వేణుగౌడ్, సాయిలు, కృష్ణవేణి, గోపాల్‌గౌడ్, సత్యనారాయణరెడ్డి, పాండురంగం, శ్రీకాంత్‌గౌడ్, రాజమల్లేశ్, బాలరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఉమాదేవి, పంచాయతీ కార్యదర్శి అలివేలు పాల్గొన్నారు.



లింగస్వామిని సన్మానిస్తున్న గ్రామస్తులు

## లింగస్వామికి సన్మానం

రామన్నపేట, జనవరి 26 : మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామానికి చెందిన వీరమల్ల లింగస్వామిగౌడ్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీ అనాటమీలో డాక్టరేట్ పొందారు. ఆదివారం గ్రామస్తులు ఆయనను గజమాల, శాలువాతో సన్మానించారు. లింగస్వామి గౌడ్ అనాటమీలో మోకాలి కీలు, దానిలో ఉన్న వివిధ లింగ్‌మెంట్స్ మెనిస్కస్‌లపై చేసిన పరిశోధనను గుర్తించి డాక్టర్ డీవై పాటిల్ విద్యాపీఠ్ యూనివర్సిటీ పూణే వారు ఇటీవల గౌరవ డాక్టరేట్‌ను అందించారు. సన్మాన కార్యక్రమంలో ఆకిటి శ్రీనివాస్, గోపగోని అశోక్, అంజిరెడ్డి, కృష్ణ, ఎర్ర శేఖర్, గణేశ్, బండ మధుకర్‌రెడ్డి, బుర్ర శ్రీశైలం, రమేశ్, బాలగోని శంకర్, మహేశ్‌రెడ్డి, గణేశ్, లింగస్వామి పాల్గొన్నారు.

## 'యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'



గుర్రాలదండి గ్రామంలో క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ప్రారంభిస్తున్న జైపాల్‌రెడ్డి

బీబీనగర్, జనవరి 26 : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని బీఆర్ఎస్ నాయకుడు బొక్క జైపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని గుర్రాలదండి గ్రామంలో గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బానోతు లాలూనాయక్, మంచాల రవికుమార్, నాయకులు దేవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, సతీశ్‌నాయక్, నగేశ్, నరేందర్ నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్, రమేశ్ నాయక్ పాల్గొన్నారు.

## 'స్వర్ణకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి'

రామన్నపేట, జనవరి 26 : స్వర్ణకారులకు తమిళనాడు తరహాలో సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని జిల్లా స్వర్ణకారుల సంఘం అధ్యక్షుడు కొండపర్తి బాలాచారి, ఉపాధ్యక్షుడు కన్నెకంటి వెంకటేశ్వరాచారి అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా స్వర్ణకారుల సంఘం సమావేశంలో వారు పాల్గొన్నారు. సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. స్వర్ణకారుల సమస్యలను పరిష్కరించాలన్నారు. స్వర్ణకారుల ఆత్మహత్యలను నివారించి ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొండూరు సంతోష్‌కుమార్, కోశాధికారి గిరిధరాచారి, నాయకులు రఘునాథ్, గోవర్ధనాచారి, సంపూర్ణాచారి, పాండురంగాచారి, రవీంద్రాచారి, విఠలాచారి, సిద్ధిరాజు పాల్గొన్నారు.

## మెగా రక్తదాన శిబిరం

గరిడేపల్లి, జనవరి 26 : గణతంత్ర దినోత్సవం సందర్భంగా గరిడేపల్లి యూత్ ఆధ్వర్యంలో తలసేమియా సికిల్ సెల్ సొసైటీ ఖమ్మం సహకారంతో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆదివారం ఎస్ఐ చలికంటి నరేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ కడియం వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, త్రిపురం అంజన్‌రెడ్డి, కానుగు హుస్సేన్, పిట్ట సైదులు, సతీశ్, రవి, నవీన్, వినేస్ పాల్గొన్నారు.




రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న యూత్ సభ్యులు



హైదరాబాద్‌లో దుశ్చర్ల సత్యనారాయణకు గవర్నర్ ప్రతిభా పురస్కారం అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

## దుశ్చర్ల సత్యనారాయణకు ప్రతిభా పురస్కారం

మోతె, జనవరి 26 : మండలంలోని రాగాపురం గ్రామానికి చెందిన దుశ్చర్ల సత్యనారాయణకు గవర్నర్ ప్రతిభా పురస్కారం –2024 అవార్డును గవర్నర్ విష్ణుదేవ్ శర్మ, సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లో అందించారు. ఈ సందర్భంగా దుశ్చర్ల మాట్లాడుతూ పర్యావరణం కోసం అడవిని సృష్టించి విశిష్ట సేవలందించినందుకు ప్రభుత్వం ఈ పురస్కారం అందించినట్లు తెలిపారు.

## నల్ల చట్టాలను రద్దు చేయాలి



నేరేడుచర్ల సెంటర్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నేరేడుచర్ల, జనవరి 26 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెచ్చిన నాలుగు నల్ల చట్టాలను రద్దు చేసి రైతులకు కనీస మద్దతు ధర చెల్లించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ కోదాడ, హుజూర్‌నగర్ పట్టణాల కార్యదర్శి వాస పల్లయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం పట్టణ సెంటర్‌లో ఇతర నాయకులతో కలసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా అధ్యక్షుడు హుస్సేన్, పీవైఎల్ జిల్లా నాయకులు వాస కరుణాకర్, అంటి భిక్షం, లక్ష్మి పాల్గొన్నారు.

## ఢిల్లీలో డప్పు కళాకారుడు సతీశ్ ప్రదర్శన



ఢిల్లీలో ప్రదర్శన ఇచ్చేందుకు సిద్ధమైన సతీశ్

గరిడేపల్లి, జనవరి 26 : మండలంలోని అప్పన్నపేట గ్రామానికి చెందిన డప్పు కళాకారుడు, జానపద కళా సామ్రాట్ అవార్డు గ్రహీత అమరవరపు సతీశ్ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ కర్తవ్యపథ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో డప్పు కళా ప్రదర్శన చేశాడు. ఈ సందర్భంగా సతీశ్‌ను పలువురు అభినందించారు.

## రైతు మహాధర్నాను జయప్రదం చేయాలి

- బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న దేప వెంకట్‌రెడ్డి

నల్లగొండ రూరల్, జనవరి 26: ఈ నెల 28న జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో నిర్వహించనున్న రైతు మహాధర్నాకు రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని బీఆర్ఎస్ నల్లగొండ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మట్లాడారు. కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వకుండా, పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ చేయకుండా రైతులను మోసం చేసిందన్నారు. ఇందిమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా వంటి పథకాల కోసం కేవలం కాంగ్రెస్ కార్యకర్తలనే ఎంపిక చేస్తున్నదని ఆరోపించారు. సమావేశంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బడుపుల శంకర్, నాయకులు పాలకూరి దరశథ, గాదరి సైదులు పాల్గొన్నారు.

**రైతులు తరలి రావాలి :వెంకన్నగౌడ్**



మాట్లాడుతున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు వెంకన్నగౌడ్

శాలిగౌరారం : ఈ నెల 28న జిల్లా కేంద్రంలో నిర్వహించ తలపెట్టిన రైతు మహాధర్నాకు రైతులు అధిక సంఖ్యలో తరలిరావాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అయితగోని వెంకన్నగౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలి రావాలని కోరారు. సమావేశంలో చాడ హతీశ్‌రెడ్డి, కట్టా వెంకట్‌రెడ్డి, మామిడి సర్వయ్య, గుజలాల్ శేఖర్‌బాబు, జెర్రిపోతుల చంద్రమౌళిగౌడ్, పాక యాదయ్య, యామగాని వెంకన్న, మామిడి రమేశ్, అంకర్ల పున్నమినాగులు, మాగి రవి, మహేశ్వరం వెంకన్న, నిమ్మల సురేశ్, వెంకన్న, శ్రీనివాస్, నాగరాజు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పెద్దవూర, జనవరి 26: మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో 2008– 09 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. తమకు చదువు చెప్పిన గురువులను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయుడు కూన్‌రెడ్డి రాంరెడ్డి, ఉపాధ్యాయులు గుంటుక రామాంజిరెడ్డి, ఇరుమాది శ్రీనివాస్‌రెడ్డి, కర్నాటి మునిరెడ్డి, మూల శేఖర్‌రెడ్డి, కర్నాటి లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాపిరెడ్డి, మోహన్‌రెడ్డి, నరేందర్, శంకరాచార్యులు, పూర్వ విద్యార్థులు రాజు, మునిలాల్, లక్ష్మణ్, అఖిలేశ్, శోభన్‌బాబు, రవీందర్‌రెడ్డి, శివకృష్ణ, వినోద్‌నాయక్ పాల్గొన్నారు.

## బొలెరో ఢీకొని వ్యక్తి మృతి

దామరచర్ల, జనవరి 26: బొలేరో వాహనం ఢీకొని మండల కేంద్రానికి చెందిన వీర్ల కోటయ్య(55) మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. కోటయ్య మండల కేంద్రంలోని వీర్లపాలెం యాదాద్రి పవర్‌ప్లాంటుకు వెళ్లే రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బొలేరో వాహనం ఢీకొట్టింది. దాంతో తీవ్రంగా గాయపడ్డ కోటయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడైన వీర్ల రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పోలీసులు తెలిపారు.

## 90 కిలోల నల్లబెల్లం స్వాధీనం

మర్రిగూడ, జనవరి 26 : మండలంలోని అజిలాపురంలో అక్రమంగా నల్లబెల్లం సరఫరా చేస్తున్న మెగావత్ కిరణ్ కుమార్‌ను ఆదివారం ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కిరణ్ తన ఆల్టో కారులో 90 కేజీల నల్లబెల్లం, 5 కేజీల ఆలమ్, 3 లీటర్ల నాటుసారా తరలిస్తుండగా పట్టుకొని బెల్లం, సారాను స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేసినట్లు సీఐ సైదులు తెలిపారు. అతడిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎస్ఐ సతీశ్, సిబ్బంది ఉన్నారు.